

19 వ వసంతంలోకి ...

# సూర్య

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం,6 జనవరి 2026


8 పేజీలు


## కోనసీమపై ఓఎన్‌జిసి గ్యాస్ మేఘం

# భారీ విస్ఫోటనం

## ఆపై అగ్నికీలలు









- పగిలిన భూగర్భ పైప్‌లైన్
- ఎగసి పడిన మంటలు.. పరుగులు తీసిన ఓఎన్‌జిసి సిబ్బంది
- కాగితాల్లో కట్టడి.. క్షేత్రస్థాయిలో కల్లోలం..!
- లక్కవరం - ఇరుసుమండ సరిహద్దుల్లో భారీ విస్ఫోటనం..
- వణికిపోయిన రాజోలు నియోజకవర్గ ప్రజలు
- భద్రత ప్రమాణాలను గాలికి వదిలేసిన డీప్ ఇండస్ట్రీస్..!
- రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో

నిన్నటి వరకు పచ్చని కొబ్బరి తోటల మధ్య ప్రశాంతంగా ఉన్న కోనసీమ ఒక్కసారిగా అగ్ని గుండంగా మారింది. భూగర్భం నుండి ఉప్పెనలా ఎగసిపడ్డ గ్యాస్ జ్వాలలు, కిలోమీటరు మేర కంపించిన భూమి..లక్కవరం-ఇరుసుమండ గ్రామస్థుల కళ్లల్లో నేటికీ మరణ భయం కనిపిస్తోంది. సాంకేతిక లోపమో,డీప్ ఇండస్ట్రీస్ భద్రతా వైఫల్యమో కానీ..ఓఎన్జీసీ బావి వద్ద సంభవించిన ఈ విస్ఫోటనం కోనసీమ గుండెల్లో మరో పాసర్లపూడి సెగను రాజేసింది.కోనసీమపై ఓఎన్జీసీ గ్యాస్ మేఘం విస్ఫోటనం..ఆపై అగ్నికీలలు ప్రజల ఆందోళనలపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో క్షేత్రస్థాయిలో అందించిన పరిశీలనాత్మక కథనం..


- మిగతా 2 లో..


## గిరిజనుల భూసమస్యలు పరిష్కరించేందుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్





**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల భూసమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని పోలవరం జిల్లా రంపచోడవరం జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో రెవెన్యూ సమస్యలు, భూ సమస్యలు, కొత్త డి పట్టాలు సమస్యలు, భూ సేకరణ, వెబ్ ల్యాండ్ సమస్యలకు సంబంధించిన కౌంటర్లను జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్, శ్రీపూజ తిరుమణి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్, సబ్ కలెక్టర్ సాహిత్, జిల్లా రెవెన్యూ అధికారి అంబేద్కర్


- తరువాయి 2లో..


## కాంగ్రెస్‌కు కార్యకర్తలే వెన్నెముక

### మాజీ కేంద్ర మంత్రి పళ్లంరాజు

- ఘనంగా పార్టీ కురువృద్ధుల సన్మాన కార్యక్రమం
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న కనుమూరి బాపిరాజు, ఎం.ఎం.పళ్లంరాజు
- సామాజిక సేవకుడు సీనియర్ కార్యకర్త నీలాపు తోట రెడ్డికి ఘన పౌర సన్మానం..





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ నీతి, నిజాయితీ మరియు ప్రజా సంక్షేమమే పునాదులుగా నిర్మితమైందని, పార్టీ పునర్నిర్మాణంలో కార్యకర్తలే కీలకపాత్రధారులని మాజీకేంద్ర మంత్రి ఎం.ఎం.పళ్లంరాజు, నరసాపురం మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సూర్యకళా మందిరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన సామాజిక సేవకులకు, పార్టీ కురువృద్ధులకు ఘనంగా సన్మాన సభ నిర్వహించారు.

**సేవలకు గుర్తింపు..ఆదర్శవంతం**

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానంద రావు పర్యవేక్షణలో, నగర అధ్యక్షుడు చెక్కా నూకరాజు అధ్యక్షతన జరిగినఈకార్యక్రమంలో పార్టీ కోసం దశాబ్దాలుగా సేవలందించిన సీనియర్లను


- తరువాయి 2లో..

# ప్రజల ప్రాణాలకు రక్షణ కవచం ఓఎన్‌జీసీ

**– గ్యాస్ లీక్ ఘటనలో అభినందనీయమైన సమయస్ఫూర్తి!**

**రాజోలు/కాకినాడ,మేజర్‌న్యూస్ :** సాధారణంగా ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు భయాందోళనలు కలగడం సహజం. కానీ, అపారమైన అనుభవం కలిగిన ఓఎన్జీసీ వంటి సంస్థ అండగా ఉంటే, ఆ ప్రమాదం చిన్నదిగా మారిపోతుందని మలికిపురం మండలం ఇరుసుమండ ఘటన నిరూపించింది. జనవరి 5న జరిగిన గ్యాస్ లీక్ ఘటనను అదుపు చేయడంలో ఓఎన్జీసీ చూపిన వేగం, అంకితభావం ఇప్పుడు ప్రతి ఒక్కరి ప్రశంసలు అందుకుంటోంది.

ప్రశంసనీయమైన అంశాలు:

**పిలవగానే స్పందించిన 'పెద్దన్న'**

ప్రైవేట్ ఆపరేటర్ డీప్ ఇండస్ట్రీస్ దగ్గర సమస్య తలెత్తిన వెంటనే, ఏమాత్రం సంకోచించకుండా ఓఎన్జీసీ తన అత్యవసర బృందాలను రంగంలోకి దింపింది. ‹ప్రమాదం ఎక్కడ జరిగినా, ప్రజల భద్రతే మా బాధ్యత› అని సంస్థ నిరూపించింది.

**అంతర్జాతీయ స్థాయి భద్రతా ప్రమాణాలు**

కేవలం స్థానిక వనరులతోనే కాకుండా, ప్రపంచ స్థాయి అంతర్జాతీయ నిపుణుల సలహాలు తీసుకుంటూ, అత్యున్నత సాంకేతికతతో ఆపరేషన్ చేపట్టింది. ఇది ఓఎన్జీసీకి ప్రజల ప్రాణాల మీద ఉన్న గౌరవానికి నిదర్శనంగా నిరూపించారు.

**చిన్న గాయానికి కూడా అవకాశం ఇవ్వకుండా..**సాంకేతిక లోపాలు ఎప్పుడైనా రావచ్చు, కానీ వాటిని ఎలా ఎదుర్కొన్నామన్నదే ముఖ్యం.




ఒక్కరికి కూడా చిన్న గాయం కాకుండా, జనవాసాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా 500–600 మీటర్ల దూరంలోనే ప్రమాదాన్ని కట్టడి చేయడం ఓఎన్జీసీ నైపుణ్యానికి నిదర్శనం.

**పారదర్శకమైన పనితీరు:**పరిస్థితిని దాచకుండా, ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం అందిస్తూ, నర్సాపురం వంటి ప్రాంతాల నుండి అదనపు పరికరాలను సమకూర్చుకుంటూ యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతోంది. సీనియర్ మేనేజ్‌మెంట్ స్వయంగా రంగంలో ఉండి పర్యవేక్షించడం ప్రజల్లో భరోసాను నింపింది.

**మన భద్రత – వారి బాధ్యత**

ఈ ఘటనలో ఓఎన్జీసీ స్పందించిన తీరు చూస్తుంటే, దేశ ఇంధన అవసరాలే కాకుండా, దేశ ప్రజల క్షేమాన్ని కూడా వారు కంటికి రెప్పలా కాపాడుతారని అర్థమవుతోంది.

భయపడాల్సిన అవసరం లేదని, రక్షణ కవచంలా ఓఎన్జీసీ అండగా ఉంటుందని ఈ ఆపరేషన్ ద్వారా స్పష్టమైంది. **ప్రజల మనసు గెలిచిన ఓఎన్జీసీ:** "సమస్య చిన్నదైనా, పెద్దదైనా.. మేమున్నాం మీకు అండగా" అనే భరోసాను ఇస్తున్న ఓఎన్జీసీ అధికారులకు మరియు సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు.

# నిరుపేద కుటుంబాలకు భరోసా... సీఎం రిలీఫ్ ఫండ్

**రావులపాలెం, మేజర్ న్యూస్ :** అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారుతున్న వేళ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మానవీయ దృక్పథంతో అండగా నిలుస్తోంది. ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా కొనసాగుతున్న ఈ సహాయక చర్యల్లో భాగంగా, నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 49 మంది లబ్ధిదారులకు రూ.40,96,408లు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరు చేయడం జరిగింది. ఈ మంజూరు ఉత్తర్వులను సోమవారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో కొత్తపేట నియోజకవర్గ యువ నాయకులు బండారు సంజీవ్ గారు లబ్ధిదారులకు అందజేశారు. తీవ్ర అనారోగ్యంతో వైద్య చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఊరటగా మారింది.మండలాల వారీగా మంజూరు చేసిన వివరాలు ఇలా ఉన్నాయి: ఆత్రేయపురం మండలం: 20 మంది లబ్ధిదారులకు రూ.14,38,280లు; రావులపాలెం మండలం: 16 మంది లబ్ధిదారులకు రూ.17,61,593లు; కొత్తపేట మండలం: 8 మంది లబ్ధిదారులకు రూ.6,30,941లు; ఆలమూరు మండలం: 5 మంది లబ్ధిదారులకు రూ.2,65,594లు. ఎల్వోసీ లబ్ధిదారులు: 4 మంది.

ఈ సందర్భంగా బండారు సంజీవ్ మాట్లాడుతూ, పేద కుటుంబాలకు వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే తమ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో లబ్ధిదారులు సమయానికి చికిత్స పొందుతూ ఆరోగ్యంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# కోనసీమపై ఓఎన్‌జిసి గ్యాస్ మేఘం - విస్ఫోటనం..ఆపై అగ్నికీలలు

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో**

బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మరోసారి గ్యాస్ విస్ఫోటనంతో ఉలిక్కిపడింది. రాజోలు నియోజక వర్గం మలికిపురం మండలం లక్క వరం – ఇరుసుమండ గ్రామ సరిహద్దుల్లోని మోరీ – 5 చమురు బావి వద్ద సోమవారం మధ్యాహ్నం సంభవించిన భారీ గ్యాస్ లీకేజీ, దానిని అనుసరించి జరిగిన అగ్నిప్రమాదం స్థానిక ప్రజలను చావు అంచున నిలబెట్టింది. అధికారులు పత్రికా ప్రకటనల్లో పరిస్థితి అదుపులో ఉంది అని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం జనం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు.

**–ఘటన విస్ఫోటనం.. ఆపై అగ్నికీలలు!**

ఓఎన్‌జీసీ తరపున పనులు నిర్వహిస్తున్న ప్రైవేట్ సంస్థ డీప్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో వర్క్ ఓవర్ కార్యకలాపాలు జరుగుతుండగా ఒక్కసారిగా భూగర్భ పైప్‌లైన్ పేలిపోయింది. గ్యాస్ మరియు క్రూడ్ ఆయిల్ మిశ్రమం వందల అడుగుల ఎత్తుకు ఎగజిమ్మడంతో పాటు, కొద్దిసేపటికే అది భారీ అగ్నికీలలుగా మారింది. విస్ఫోటనం దాటికి కిలోమీటరు మేర భూమి కంపించినట్లు స్థానికులు చెబుతున్నారు.

**–సంస్థల వాదన జం క్షేత్రస్థాయి వాస్తవాలు**

సంస్థ విడుదల చేసిన ప్రకటనకు, అక్కడ కనిపిస్తున్న దృశ్యాలకు పొంతన లేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

**–జనావాసాల లెక్క :** బావి జనావాసాలకు 500–600 మీటర్ల దూరంలో ఉందని సంస్థ చెబుతోంది. కానీ, దట్టమైన తెల్లటి పొగమంచులా కమ్మేసిన గ్యాస్ క్లౌడ్ కిలోమీటర్ల మేర వ్యాపించింది. ఇరుసుమండ, లక్కవరం గ్రామాల్లోని ప్రజలు శ్వాస తీసుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

**–భద్రతా వైఫల్యం :** రూ1402 కోట్ల కాంట్రాక్ట్ తీసుకున్న డీప్ ఇండస్ట్రీస్ భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేసిందనే ఆరోపణలు వస్తున్నాయి. గత ఒక ఏడాదిగా ఈ బావి వద్ద పనులు జరుగుతున్నా, కనీస ముందస్తు రక్షణ చర్యలు లేకపోవడమే ఈ విస్ఫోటనానికి కారణమని నిపుణులు భావిస్తున్నారు.

–ముందస్తు హెచ్చరికలు ఏవి : ప్రమాదం జరిగాక వాల్వ్ క్లోజింగ్ చేస్తున్నామని చెప్పడం కాకుండా, అసలు ఇలాంటి ముప్పు పొంచి ఉందని గ్రామస్థులకు ముందుగా ఎందుకు తెలియజేయలేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

–యుద్ధప్రాతిపదికన చర్యలు.. నిలిచిపోయిన విద్యుత్

ప్రమాద తీవ్రత దృష్ట్యా జిల్లా యంత్రాంగం హై అలర్ట్ ప్రకటించింది.

**– రాకపోకల నిలిపివేత :** ఇరుసుమండ వైపు వెళ్లే అన్ని రహదారులను పోలీసులు మూసివేసి భారీ బారికేడ్లను ఏర్పాటు చేశారు.

**–విద్యుత్ కోత :** షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు మరింత వ్యాపించకుండా ఆ ప్రాంతమంతా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ప్రజలు అగ్గిపెట్టెలు వాడొద్దని, ఎలక్ట్రానిక్ వస్తువులు ఆన్ చేయొద్దని పోలీసులు మైకుల ద్వారా హెచ్చరిస్తున్నారు.

**–పాశర్లపూడి చేదు జ్ఞాపకాలు..**కోనసీమ వాసులకు పాశర్లపూడి అగ్నిప్రమాదం ఒక పీడకల. నేటి ఘటన ఆ చేదు జ్ఞాపకాలను మరోసారి గుర్తుకు తెచ్చింది. ‹ప్రభుత్వాలు మారుతున్నాయి, సంస్థల లాభాలు పెరుగుతున్నాయి.. కానీ కోనసీమ గుండెల్లో మండుతున్న ఈ గ్యాస్ సెగలు మాత్రం చల్లారడం లేదు› అని స్థానిక రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది.

**–ముఖ్యమంత్రి పర్యవేక్షణ...**ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. తక్షణమే విపత్తు నిర్వహణ బృందాలను రంగంలోకి దించాలని, అవసరమైతే గ్రామాలను ఖాళీ చేయించాలని అధికారులను ఆదేశించారు.

**–మేధావుల మాట...**

అధికారులు కేవలం పత్రికా ప్రకటనలతో ప్రజలను శాంతింపజేయాలని చూడకుండా, గాలిలో కాలుష్య తీవ్రతను పారదర్శకంగా వెల్లడించాలి. అంతర్జాతీయ నిపుణులు వచ్చేవరకు ఆగకుండా, స్థానికంగా ఉన్న వనరులతో గ్యాస్ లీకేజీని అరికట్టి ప్రజల ప్రాణాలకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ఓఎన్‌జీసీ మరియు ప్రభుత్వానిదే అని మేధావులు చెప్తున్నారు.

## గిరిజనుల భూసమస్యలు పరిష్కరించేందుకు చర్యలు

మొదటిపేజి తరువాయి

పరిశీలించారు.ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ పోలవరం జిల్లా రంపచోడవరంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ సమస్యలపై మొత్తం 74సమస్యల దరఖాస్తులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రతి సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు జిల్లాలోని ఆయా మండలాల తాసిల్దారులకు సమస్యల దరఖాస్తులు పంపించి ప్రభుత్వ నిబంధన ప్రకారం దరఖాస్తుదారుల అర్హతలను బట్టి సమస్యలు పరిష్కరించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతివారం రెవెన్యూ శాఖకు వచ్చిన సమస్యల దరఖాస్తులు ఎన్ని పరిష్కరించినవి ఇంకెన్ని పరిష్కరించవలసి ఉన్నది ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దారులు సరిత, శ్రీధర్, శివ, విలేజ్ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు కార్యకర్తలే వెన్నెముక

మొదటిపేజి తరువాయి

గౌరవించుకు న్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎఫ్.సి.ఐ. ఉద్యోగి, సామాజిక సేవకులు నీలాపు తోటరెడ్డిని పళ్లంరాజు, బాపిరాజులు దుశ్శాలువాతో సత్కరించి, స్మారక చిహ్నాన్ని అందజేశారు.ఈ సభనుఉద్దేశించి కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ, 130 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీలో సభ్యుడిగా ఉండడమే ఒక గౌరవమని, ఎన్ని పదవులు అనుభవించినా కార్యకర్త అనే గుర్తింపు మరెంతో గొప్పదని అన్నారు. పళ్లంరాజు మాట్లాడుతూ.. పార్టీ పట్ల నిబద్ధత, ప్రజాసేవ దృక్పథం కలిగిన వారిని గుర్తించి భవిష్యత్తులో కీలక బాధ్యతలు అప్పగిస్తామని హామీ ఇచ్చారు.

**కార్యకర్తలకు పిలుపు:** గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి.ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడమే కాంగ్రెస్ సైనికుల బాధ్యత.సీనియర్ నాయకుల అనుభవాన్ని స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలి.ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు వివిధరంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

# జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లతో ఆర్థికాభివృద్ధి

**– జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీలో మహిళలు జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని పోలవరం జిల్లా (రంపచోడవరం) ఇంచార్జ్ కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సాయంకాలం కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో ఉన్నటువంటి జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ను జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీపూజ తిరుమణి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్, సబ్ కలెక్టర్ సాహిత్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీలో మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రతి సంవత్సరం జీడిపిక్కలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయుటకు తగు చర్యలు చేపట్టాడం జరుగుతుందని ఆయన అన్నారు. ఇక్కడ ప్రాసెసింగ్ చేసిన జీడిపప్పు మార్కెటింగ్ పంపే విధంగా తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఒక్కొక్క జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్కు ఎంత ఖర్చవుతుంది అదేవిధంగా ఒక కేజీ జీడి పిక్కలు ప్రోసెసింగ్ చేయుటకు ఎంత సమయం పడుతుంది ఒక కేజీ జీడిపిక్కలు ప్రాసెసింగ్ చేసిన అనంతరం ఎంత ప్రాఫిట్ ఎంత ఉంటుంది ఆయన ఆరా తీశారు.

ఒక్క యూనిట్‌లో ఎంతమంది పనిచేయుచున్నది, జీడిపిక్కలు బాయిల్ చేయుటకు కట్టెలకు ఎంత ఖర్చవుతుంది, కరెంటుకి ఎంత ఖర్చవుతుంది, జీడిపిక్కల ట్రాన్స్పోర్ట్‌కు ఎంత ఖర్చవుతుంది, రోజువారి కూలీలకు ఎంత ఖర్చవుతుంది అదేవిధంగా ఖర్చుపెట్టిన నిధులకు ఎంత లాభం ఉంటుంది తదితర విషయాలు కలెక్టర్ ఆరా తీశారు. జీడిపిక్కల ప్రా సెసింగ్ చేయుటకు ఒక్కొక్కరికి ప్రతిరోజు టార్గెట్ ఇవ్వాలని అదేవిధంగా టార్గెట్ ఇచ్చిన వాటిని ప్రతిరోజు పర్యవేక్షించాలని ఆయన అన్నారు. జీడిపిక్కల ప్రాసెసింగ్‌పై రాజమండ్రి, శ్రీకాకుళం, హైదరాబాద్ తదితర ప్రాంతాలలో శిక్షణ ఏర్పాటు చేయుటకు కొంతమంది మహిళలను తీసుకొని వెళ్లి శిక్షణ ఇప్పించాలని సంబంధిత అధికారులు ఆయన ఆదేశించారు. జీడిపిక్కలు చేసే పరికరాలను ఏ విధంగా జీడిపప్పు ప్రాసెస్ చేయుచున్నది పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిడి దేగలయ్య, ఏపీయంలు సూరిబాబు, దుర్గ ప్రసాద్, దేయేంద్ర రావు, రామరాజు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

**ఆర్.ఓ.సి. నెం. 225/2025-జి-1** **తేది : 05.01.2026**

# బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఈ దిగువ తెలిపిన మాస్టర్ ప్లాను రోడ్డు అనగా కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఈ దిగువ తెలిపిన మాస్టర్ ప్లాను రోడ్డు అనగా 1. గుడారి గుంట (పావురాల తూము నుండి ఉప్పరిపేట) రోడ్డు, 2. స్టేడియం రోడ్డు, రమణయ్యపేట, 3. గంజాం వారి వీధి, 4. సుభాష్ రోడ్డు (or) మెయిన్ రోడ్డు, 5. తిలక్ స్ట్రీట్ 6. కచేరిపేట రోడ్డు, 7. యేసువారి వీధి (విష్ణాలయం వీధి) జగన్నాథపురం, 8. మంత్రిప్రగడ వారి వీధి, 9. వాకలపూడి రోడ్డు, 10. సాంబమూర్తి నగర్ 5వ వీధి, 11. రమణయ్యపేట వద్ద (సైటు ఫర్ పబ్లిక్ పర్పస్) నందు భవిష్యత్తులో అభివృద్ధి చేయవలసిన రోడ్లు నిమిత్తము ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన స్థలములు అవసరమైనందున ఆయా వ్యక్తులు భవన నిర్మాణ అనుమతులతో ముందుకు వచ్చి పై తెలిపిన రోడ్లు విస్తరణలో పోవుచున్న స్థలములను నగరపాలక సంస్థకి స్వాధీనపరచుటకు తద్వారా వారికి ప్రత్యామ్నాయంగా నష్టపరిహారమునకు బదులుగా Transferable Development Right Certificate (TDRC) నకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనియున్నారు.

ఇందుపై ప్రస్తుతము అమలులో వున్న ప్రభుత్వ ఉత్తర్వులు G.O.Ms.No. 119 MA & UD, Dept Dt. 28-03-2017, G.O.Ms.No. 180, MA&UD, Dept Dt.01-10-2020 మరియు తదుపరి ఉత్తర్వులు G.O.Ms.No. 4, MA&UD, Dept Dt.09-01-2025 లను అనుసరించి రోడ్డు విస్తరణకు కావలసిన స్థలమును స్వాధీనపరచుకుని Transferable Development Right Certificate (TDRC) జారీ చేయుటకు అవకాశము కల్పించబడినది మరియు సదరు Transferable Development Right Certificate జారీ చేయుటకు సదరు దరఖాస్తులను సవివరముగా పరిశీలించి ఈ క్రింది తెలుపబడిన దరఖాస్తుదారులకు Transferable Development Right Certificate ల కొరకు TDR కమిటీ వారి నిర్ణయమునకు లోబడి జారీ చేయబడునని తెలియజేయడమైనది.

| S.No. | Name of the Applicant | Location of the Site Affected | Survey Number | Extent Affected in Road Widening as Per Master Plan / Area Development Plan In (Sq.m.) | Master Plan Road / Area Development Plan Road / Connecting Road | Application Number/ Date | Urban / Rural | Remarks |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | R.V.V. STYANARAYANA MURTHY | Godarigunta, Paavurala Toomu | 1974 | 30.93 | Master Plan Road | 016443 | Urban | |
| 2 | Smt SAGARAPU NOOKALAMMA | Godarigunta (Paavurala Toomu lo Upparipeta) | 237/4P ART | 153.28 | Master Plan Road | 017524 | Urban | |
| 3 | 1.Degala Suresh Kumar, 2. Degala Ram Mohan Raja | Godarigunta (Paavurala Toomu lo Upparipeta) | 52/3A (P) | 708.4 | Master Plan Road | 017581 | Urban | |
| 4 | Madduri Venkata Ramana | Godarigunta (Paavurala Toomu lo Upparipeta) | 52/3A (P) | 1208.62 | Master Plan Road | 017582 | Urban | |
| 5 | Yannam Varalakshmi | Stadium Road | 85/4 (P) | 37.51 | Master Plan Road | 017579 | Urban | |
| 6 | 1. Yannam Venkataramana murthy 2. Yannam Varalakshmi | Stadium Road | 85/4 (P) | 75.73 | Master Plan Road | 017578 | Urban | |
| 7 | Batchu Naga Venkata Madhusushanarao | Gajnam vari Street | 417 part | 21.62 | Master Plan Road | 017354 | Urban | |
| 8 | Batchu Umavenkata Sumanth Kumar | Gajnam vari Street | 417 part | 20.58 | Master Plan Road | 017355 | Urban | |
| 9 | Nunna Mohanarao | Subash Road or Main Road | 927 (P) | 56.87 | Master Plan Road | 017563 | Urban | |
| 10 | Chamarthi Satya Anuradha | MANTRIPRAGADA VARI STREET | 32 (P) | 14.98 | Master Plan Road | 017583 | Urban | |
| 11 | Samayamanthula Sri Krishna | Ganjam vari Street | 42/1 (P) & 42/2 (P) | 25.48 | Master Plan Road | 017139 | Urban | |
| 12 | BHERE SRI RAMYA | Tilak Street | 148 Part | 20.53 | Master Plan Road | 017559 | Urban | |
| 13 | Pydah Venkateswara Rao | Subash Road or Main Road | 462 Part | 30.95 | Master Plan Road | 017590 | Urban | |
| 14 | PEPAKAYALA PRANEETH KUMAR | Katcheripeta Road | 61/1 | 46.82 | Master Plan Road | 017584 | Urban | |
| 15 | Kollepara Sridhar | Vishnalayam Street and Yesuvari Street | 320/1 | 30.31 | Master Plan Road | 017006 | Urban | |
| 16 | DESALANKA MOOLAYYA | VAKALAPUDI ROAD | 95/11 | 63.75 | Master Plan Road | 017620 | Rural | |
| 17 | SHAIK DARIA SAHEB | SAMBAMURTHY NAGAR 5TH STREET | 2254/6A | 68.73 | Master Plan Road | 017619 | Urban | |
| 18 | GUNTUMUKKULA SRINIVASA RAO | RAMANAYYAPETA | 101/1 PART | 235.226 | Site for public purpose | 017618 | Rural | |

పైన తెలిపిన దరఖాస్తుల విషయమై ఎవరికైనా అభ్యంతరములు ఉన్నయెడల ఈ ప్రకటన తేదీ నుండి 07 రోజులలోగా ఈక్రింది సంతకము దారునకు లిఖితపూర్వకముగా ఆఫీసు పనివేళలలో అందజేయవాల్సినదిగా కోరడమైనది.

**ఎన్.వి.వి.సత్యనారాయణ**
కమిషనర్,
కాకినాడ నగరపాలక సంస్థ

# మౌలిక సదుపాయాలతో గ్రామ అభివృద్ధి చేస్తాం

- గ్రామ సభలో ఎమ్మెల్యే బండారు
- రైతులకు పాసు పుస్తకాలు అందజేత



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొత్త రూపును తీసుకువచ్చి నేటి పరిస్థితులకు అనుగుణంగా అందరికీ మేలు కలిగే విధంగా వికసిత్ భారత్ జిరామ్ జీ పథకం రూపుదిద్దుకుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. దీనితో ఉపాధికి మరింత గ్యారంటీ రాబోతోందని ఎమ్మెల్యే బండారు అన్నారు. కొత్తపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 125 రోజుల వేతన ఉపాధి హామీ తో పాటు నీటి భద్రత, రైతాంగానికి మేలు చేసేవిధంగా వికసిత్ భారత్ జీరామ్ జీ ఉండబోతుందని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే ఆస్తులు ఏర్పాటు చేసే విధంగా,మౌలిక సదుపాయాల కోసం,రహదారుల అనుసంధానం కోసం,గ్రామ పంచాయతీ భవనాలు,పాఠశాల గదుల నిర్మాణం,పారిశుద్ధ్య నిర్వహణ కోసం ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. గతంలో 100 రోజులు ఉన్న పనిదినాల సంఖ్య నేడు 125 రోజులకు పెరగడం, వ్యవసాయ పనులకు ఆటంకం లేకుండా 60 రోజులు వ్యవసాయ పనుల సమయంలో విరామం ఉంటుందన్నారు.మిగిలిన రోజుల్లో 125 రోజులు ఉపాధిహామీ గ్యారంటీ లభించడం పేదప్రజలకు మేలు చేసేవిధంగా ఉందని తెలియజేశారు.జీవనోపాధి పెంచడం కూడా ఈ పథకంలో భాగం అన్నారు.కొత్తపేట అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. రూ.5లక్షలతో గవర్నమెంట్ హాస్పటల్లో షెడ్ నిర్మించామని తెలిపారు.తహసీల్దార్ కార్యాలయం నిర్మాణానికి రూ.1.87కోట్లకు అంచనాలు రూపొందించి ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖా మంత్రులకు పంపడం జరిగిందన్నారు. వీఆర్వో ఆఫీసు సమీపంలో రెండు బస్ షెల్టర్లు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.ఆర్డబ్ల్యుఎస్ ఆఫీస్ తీసుకురావడం జరిగిందన్నారు.ఎక్సైజ్ కార్యాలయం బ్యాంక్ కాలనీకి షిఫ్ట్ చేయడం జరుగుతుందని తెలిపారు.నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏనుగు మహల్లో డ్రైన్లు,రహదారులు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కైలాసభూమి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రూ.3 కోట్లతో నిర్మించనున్న కమ్మిరెడ్డి పాలెం-వాడపాలెం రహదారి పనులు త్వరలోనే మొదలుపెడతామన్నారు. వాడపాలెం పెదపేట రహదారి తారు రోడ్డుగా మార్చడానికి నిధులు మంజూరు చేయించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు పాసు పుస్తకాలు అందజేశారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన అనేక రెవెన్యూ తప్పిదాలను సరిదిద్ది రైతులకు రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు అందివ్వడం జరుగుతుందన్నారు. ఇంకా రైతులకు కొన్ని సమస్యలు మిగిలి ఉన్నాయని వాటిని పరిష్కరించాల్సి ఉందన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం రెవెన్యూ శాఖలో అనేక మార్పులు చేయడం జరిగిందని,17 అధికారాలు డీ సెంట్రలైజ్ చేయడం జరిగిందన్నారు. పరిసరాలు బాగుండాలంటే అందరూ పారిశుద్ధ్య కార్మికులకు సహకారం అందించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ని చెత్త రహిత రాష్ట్రంగా, కొత్తపేట చెత్త రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.మన ఇల్లు ఎంత బాగున్నా,మన వీధులు,గ్రామాలు, పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే మనం అనారోగ్యం పాలవడం గ్యారంటీ అన్నారు.అందుకే అందరూ పరిసరాల పరిశుభ్రత పై దృష్టి సారించాలన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే సహించేది లేదు

- సైబర్ నేరాలపై ప్రజల అప్రమత్తంగా ఉండాలి
- అనపర్తి పోలీస్



**అనపర్తి, మేజర్ న్యూస్ :** ప్రజలందరూ సంక్రాంతి సంబరాలను కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా, ఆనందంగా జరుపుకోవాలని పండుగ పేరుతో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన సహించేది లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అనపర్తి సిఐ సుమంత్ ఎస్సై శ్రీను నాయక్ అన్నారు.ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ సుమంత్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల ఆగడాలు చాలా ఎక్కువగా ఉన్నాయని, సైబర్ నేరాలపై ప్రజల అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని, మనకు డబ్బు ఆశ చూపి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, అనేక రకాలుగా మనల్ని మభ్యపెట్టి, మాయమాటలు చెబుతూ మనల్ని మోసం చేస్తారని సైబర్ నేరాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎస్సై శ్రీను నాయక్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ మూడు రోజులు ప్రజలు కుటుంబ సభ్యులతో సంక్రాంతి సంబరాలు జరుపుకోవాలని, గుండాట, పేకాట, కోడిపందాలు, అశ్లీల నృత్యాలు వంటి వాటికి దూరంగా ఉండాలని, అటువంటి అసంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదని ఒకవేళ ఎవరైనా నిర్వహించిన, ఆ ప్రాంతాలకు వెళ్లిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

## వికసిత్ గ్రామాలే లక్ష్యంగా గ్రామ సభలు

- ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** విబి జీ రామ్ జీ చట్టంపై సోమవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెద్దాపురం మండలపరిషత్ అభివృద్ధి అధికారిఆధ్వర్యంలో మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలలో ఆయా శాఖల సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. దీనిలో భాగంగా మండలంలోని మర్లావ గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ తోట రామకృష్ణ అధ్యక్షతన జరిగిన విబి జీ రామ్ జీ చట్టంపై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ, డిప్యూటి ఎంపిడిఓ జి.శేఖరరెడ్డిలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపిడిఓ తెలుపుతూ శ్రామికుల ఉపాధి కోసం స్థిరమైన జీవనోపాధి అవకాశాలకు ప్రాధాన్యతతో పాటు సామాజిక ఆర్థిక సాధికారితను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుని, కేంద్ర ప్రభుత్వం విబి జీ రామ్ జీ చట్టం తీసుకు వచ్చిందని, ఈ చట్టంపై అవగాహన కోసం కరపత్రాలు, పోస్టర్లు, హోర్డింగ్‌లు తయారు చేసి ప్రతీ గ్రామ సభ వేదిక వద్ద ఉంచడం జరిగిందని, గ్రామ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి,చట్టంపై విస్తృత అవగాహన కల్పించడం జరుగుతుందని, కావున ఉపాధి సిబ్బందికి ప్రజలు అవగాహన కల్పించవలసిన బాధ్యత ఉందని, ఆయన తెలిపారు. ఉపాధి వేతనదారులకు 125 రోజులు ఉపాధి పనులు పెంచడం జరిగిందని, ఆయన తెలిపారు. సర్పంచ్ తోట రామకృష్ణ, డిప్యూటి ఎంపిడిఓ జి.శేఖరరెడ్డిలు గ్రామసభను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం గ్రామంలోని స్వచ్ఛ సంక్రాంతి పారిశుద్ధ్యంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. చెత్త రహిత గ్రామాలుగా ప్రతీ గ్రామాన్ని తీర్చిదిద్దడంలో ప్రతీ ఒక్కరూ సహకరించాలని, ఎంపిడిఓ, డిప్యూటి ఎంపిడిఓలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ యాళ్ళ రామకృష్ణ, పంచాయతీ సెక్రటరీ హేమ శ్రీ, ఉపాధి, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మున్సిపల్ పిజిఆర్ఎస్‌కు మూడు అర్జీలు

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** సోమవారం పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి మూడు అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, ఆర్ఐ గంగాధరరావు, వెంకటలక్ష్మి, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# పిఠాపురంలో పవన్ కళ్యాణ్ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** సంక్రాంతి సంబరాలలో భాగంగా ఈ నెల 9వ న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటన సందర్భంగా ఇటువంటి లోటుపాట్లు లేకుండా పగడ్బంధిగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. పిఠాపురంలో ఈనెల 09 నుంచి 11 వరకు జరగనున్న సంక్రాంతి సంబరాలు నిర్వహణ, ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను సోమవారం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్, రెవెన్యూ, పోలీస్, టూరిజం, మున్సిపాలిటీ, పాడా, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పిఠాపురం ఆర్ఆర్ బిహెచ్ఆర్ జూనియర్ కళాశాల మైదానంలో ఉన్న హెలిప్యాడ్, పాత బస్టాండ్ వద్ద ఉన్న మున్సిపల్ పాఠశాల ఆవరణంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాల ఏర్పాట్లను పరిశీలించారు. సభా వేదిక, స్టాల్స్ ఏర్పాట్లు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ పిఠాపురంలో ఈనెల 09 నుంచి 11 వరకు నిర్వహించనున్న సంక్రాంతి సంబరాల ఏర్పాట్లు వేగవంతం చేయాలని, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉప ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని కోరారు. ఓబీసీ పాఠశాలలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా సాంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, సాధారణ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ అధికారులు పటిష్ట బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాస్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్. మల్లి బాబు,_. శ్రీరమణి, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్చార్జి కమిషనర్, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, డ్వామా పీడీ ఎ. వెంకటలక్ష్మి, పాడా పీడీ ఎ. శ్రీనివాసరావు, సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ ఆర్వీఎస్. రామచంద్రరావు, ఏఈఐఈ సి. బాబురావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం...

- బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి
- ప్యానెల్ న్యాయవాది భాస్కర్




**పిఠాపురం, మేజర్ న్యూస్ :** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి. దుర్గారాణి, ప్యానల్ అడ్వకేట్ భాస్కర్ అన్నారు. బాల్య వివాహ్ ముక్త్ భారత్ 100 రోజుల కాంపెయిన్ లో భాగంగా కాకినాడ జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షమ శాఖ మరియు మండల న్యాయ సేవాధికార సంస్థ సంయుక్తంగా పిఠాపురం స్థానిక ఆర్ఆర్ బిహెచ్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు మరియు జల్లూరు గ్రామ ఎంపీయూపీ పాఠశాల నందు బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి. దుర్గారాణి, ప్యానల్ అడ్వకేట్ భాస్కర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆర్ఆర్ బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఊటుకూరి కేశవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి మాట్లాడుతూ... మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు బాల్య వివాహ ముక్త్ భారత్ అనే కాంపెయిన్ 27 నవంబర్ 2025 నుండి 8 మార్చి 2026 వరకు అవగాహన కార్యక్రమాలు కాకినాడ జిల్లా అంతటా నిర్వహిస్తున్నా మన్నారు. బాల్య వివాహ రహిత దేశంగా భారత దేశాన్ని తీర్చి దిద్దాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాలను విద్యా రంగ సంస్థలలో నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు పూర్తి కాకుండా మరియు అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయరాదని, బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం మరియు నేరమని, ఎవరైనా ప్రేమ పేరుతో వేధించిన లేదా లైంగిక వేధింపులకు గురిచేసిన, ప్రలోబాలకు పాల్పడిన, బాల్య వివాహాలు చేస్తున్నట్లు సమాచారం ఉన్న వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా పోలీస్ 112 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ప్యానెల్ లీగల్ అడ్వకేట్ భాస్కర్ మాట్లాడుతూ... హై కోర్టు ఉత్తర్వులు ప్రకారం మరియు 12వ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ వారు ఆదేశాలు మేరకు 100 రోజులు కాంపెయిన్ లో బాల్య వివాహ రహిత దేశంగా తీర్చి దిద్దాలనే దృక్పథంతో ఈ అవగాహన కార్యక్రమాలను సంబంధిత శాఖలు మరియు స్వచ్ఛంద సంస్థల సమన్వయముతో నిర్వహించడం జరుగుతుందని, ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహించినా మరియు సహకరించినా లేదా వివాహం చేసినా... బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం రెండు సంవత్సరాల జైలు శిక్ష మరియు ఒక లక్ష రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని, పోక్సో చట్టం ప్రకారం కూడా చర్యలు తీసుకుంటామని తెలియజేసారు.

ఈకార్యక్రమములో పారాలీగల్ వాలంటీర్లు రాంబాబు, కామేశ్వరరావు, శీలం వరలక్ష్మి, జి.బేబీ, అంగన్వాడీ కార్యకర్తలు శాంత కుమారి, రాజేశ్వరి, కాలేజ్ లెక్చరర్స్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పిఠాపురంలో అధిక ధరలకు మద్యం అమ్మకాలు

- పాడాలో ఫిర్యాదు చేసిన మానవ హక్కుల కౌన్సిల్ ఈగల త్రిమూర్తులు

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురంలో అధిక ధరలకు మద్యం విక్రయాలు చేపడుతున్నారని మానవ హక్కుల కౌన్సిల్ డిఫెండర్ ఈగల త్రిమూర్తులు సోమవారం పాడా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పిఠాపురం పట్టణంలో గతకొద్ది రోజులుగా... అన్ని మద్యం షాపుల్లోనూ ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా ధరలు పెంచి వసూలు చేస్తున్నారని, ధరలు ఎందుకు పెంచి అమ్ముతున్నారని వినియోగదారులు ప్రశ్నిస్తే... వ్యాపారులు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎటువంటి బిల్లులు ఇవ్వడం లేదని, షాపుల వద్ద ధరల పట్టిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదని, పై సమస్యలు పరిష్కరించమని కోరుతూ... సోమవారం పాడా కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.



# ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** పీఆర్ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ప్రిన్సిపాల్ వి.రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన, డాక్టర్ మానికిరెడ్డి సత్యన్నారాయణ ముఖ్య అతిథిగా కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే 1831 లో జన్మించారని 9 సంవత్సరాల వయస్సులో జ్యోతిరావు పూలేతో వివాహం జరిగిందని, 1848 లో వారు పేదవారి కోసం మొదటి పాఠశాల నిర్వహించి తర్వాత 52 పాఠశాలలు నిర్వహించారని అందుకోసం ఆమె అనేక అవమానాలు ఎదుర్కొన్నారని, ఆమె రోడ్డుపై వెళ్తున్నప్పుడు బురద చల్లటం, నానా విధాలుగా మాట్లాడటం చేసేవారని తెలిపారు. మానికిరెడ్డి సత్యన్నారాయణ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే సమాజంలోని కులతత్వం, పురుషాధిక్య ధోరణులు కలిగిన చాలామందికి కూడా ఆమె కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు. కానీ ఆమె ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి, సంఘసంస్కర్త, 1873 లో తన భర్త మహాత్మా పూలేతో కలసి సత్యశోధక్ సమాజ్‌ను ప్రారంభించి బాల్యవివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా, వితంతువు పునర్వివాహాల కొరకు బలమైన ఉద్యమం నడిపారు. బాల్యంలోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లల్లో వెలుగు చూసారు. సమాజం కోసం జీవించి, సమాజం కోసం మరణించిన వ్యక్తి మాత్రమే అసలైన సంఘసంస్కర్త అవుతారని నిరూపించారని, జ్యోతీరావుపూలే 1890 నవంబరు 28న మరణించడంతో మరణాంతరం సత్యశోధక్ సమాజ్ బాధ్యతనీ స్వీకరించి నడిపించారని, 1896-97లో సంభవించిన తీవ్ర కరువు, ప్లేగు వ్యాధి మహారాష్ట్ర జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఈ పరిస్థితుల్లో పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం, కరువు ప్రాంతాల్లోని దళితులు, పేదల కోసం జోలెపట్టి విరాళాలు సేకరించి అందించారు. ప్లేగు వ్యాధి సోకిన పేదలకు దగ్గరుండి సేవలందించారు. ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలు నిర్వహించింది. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకి సోకి మార్చి 10, 1897లో మరణించారని తెలిపారు. ఆమె జీవితం ఎంతో మందికి ఆధారప్రాయమని, విద్యార్థినులు అందరూ బాగా చదువుకొని అభివృద్ధిలోకి రావాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాలలోని 11 మంది మహిళా అధ్యాపకులను జాతీయ సేవా పథకం తరపున పూల మాలలు, దుశ్శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు పిల్లి. వీ.శివప్రసాద్, కే.నిరంజన్ కుమార్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛ సంక్రాంతిలో భాగంగా పారిశుధ్య పనుల పరిశీలన




**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** స్వచ్ఛ సంక్రాంతిలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని కాండ్ర కోట, మర్లావ, పులిమేరు, దివిలి గ్రామాలలో నిర్వహిస్తున్న గ్రామ సభలను, స్వచ్ఛ సంక్రాంతి పనులను, డిప్యూటీ ఎంపిడిఓ జి.శేఖరరెడ్డితో కలిసి పరిశీలించారు. ఆయా గ్రామాలలో ఎంపిడిఓ, డిప్యూటీ ఎంపిడిఓ పర్యటిస్తూ డ్రైన్లలో ఎప్పటికప్పుడు పూడిక తీయించి, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని, ఇంటింటికి వెళ్ళి తడి చెత్త పొడి చెత్త వేర్వేరుగా సేకరణ పారిశుధ్య సిబ్బంది నిర్వహించి, ఎస్‌డబ్ల్యూపి కేంద్రాలకు తరలించాలన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉండాలని, చెత్త, చెదారం వీధులలో వేయకుండా పంచాయతి కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్‌డబ్ల్యూపి కేంద్రాలను పరిశీలించారు. అనంతరం కాండ్రకోట గ్రామ పంచాయతీలో గ్రామ సభలో పాల్గొని, పంచాయతీ రికార్డులను ఎంపిడిఓ పరిశీలించడం జరిగింది. ఈ గ్రామ సభలలో కూటమి నాయకులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఎపిఓ సుధీర్, జెఇ సతీష్ కుమార్, పంచాయతీ సెక్రటరీలు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు, పాల్గొన్నారు.

## సావిత్రి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన యుటిఎఫ్



**కూనవరం, మేజర్ న్యూస్ :** కూనవరం యుటిఎఫ్ శాఖ కోతులుగట్ట పరిధిలోని ఐటిడిఏ. ఫాం దగ్గర మామిడి తోటలో యుటిఎఫ్. కూనవరం మండల కమిటీ ఆధ్వర్యంలో భారత దేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు శ్రీ మతి సావిత్రి భాయ్ పూలే జయంతి సభను యు. టి. ఎఫ్. కూనవరం మండల అధ్యక్షులు ఎ. నాగేశ్వరావు గారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా సహాధ్యక్షులు మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉందని తెలిపారు. అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులు విజయ మాట్లాడుతూ ఆనాటి సాంఘిక దూరాచారాలను పారద్రోలిన మహా స్త్రీ మూర్తి అని అన్నారు. ప్రమీల, నాగదుర్గ, ధనలక్ష్మ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పాటు పడి స్త్రీ పాఠశాలను స్థాపించిన సంఘసంస్కర్త అని అన్నారు. యటపాక మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ స్త్రీలకు విద్యను అందించిన మహిళా శక్తి అని ఈ కార్యక్రమాన్ని ఇంతా ఘనంగా నిర్వహించిన యుటిఎఫ్. మండల కమిటీ కి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల ప్రధాన కార్యదర్శి పి. కన్నారావు, గౌరవ అధ్యక్షులు పి. రాజారావు, కుమారి, శాంతి, సత్య, రాజేశ్వరి, ప్రసన్న, యామాని దివ్య తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పిల్లలకు చలికి రక్షణగా మంకీ క్యాప్‌లు



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లి గ్రామంలో జనవరి 5వ తేదీ సోమవారం స్థానికంగా ఉన్న 12 అంగన్వాడి సెంటర్లలో చదువుకుంటున్న అంగన్వాడీ పిల్లలకు శీతాకాలంలో చలిని తట్టుకునే విధంగా మంకీ క్యాప్ లను ఖండవల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి బహుకరించారు. శతకాలం పిల్లలకు చలి నుండి రక్షణ కల్పించే మంకీ క్యాప్ లను అందించిన దాత చక్రవర్తిని అంగన్వాడీ టీచర్లు ఆయాలు అభినందించారు.

# ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా

– రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు, మేజర్ న్యూస్ :** ప్రజారోగ్యానికి ఆర్థిక భరోసానిచ్చి, ఆరోగ్యకరమైన సమాజమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పనిచేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం నిడదవోలు క్యాంపు కార్యాలయంలో మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా నిడదవోలు నియోజకవర్గంలో అనారోగ్యం బారిన పడిన 61 మంది బాధితులకు రూ.44,80,458 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ వోసీ పత్రాలు పంపిణీ పంపిణీ చేశారు. అందులో 57 మందికి రూ.31,80,458 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున ముగురికి రూ. 9 లక్షల ఆర్థిక సాయం, అదే విధంగా రూ. 4 లక్షల విలువైన ఎల్ వోసీ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం అని , ప్రజలు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటివరకు నిడదవోలు నియోజకవర్గంలో సీఎం సహాయ నిధి క్రింద 556 మందికి 4 కోట్ల 9 లక్షల 17 వేల 825 రూపాయల లబ్ధి చేకూర్చామని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు, కూటమి ప్రభుత్వానికి మంత్రి కందుల దుర్గేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మంత్రి దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారుల మొఖాల్లో ఆనందం చూస్తే రాజకీయంగా ఒక నాయకుడికి అంతకన్నా సంతృప్తి ఇంకేముంటుందని మంత్రి దుర్గేష్ అన్నారు. ఒక పక్క పేదరికం, మరో పక్క అనారోగ్యం ఈ రెండూ ఉంటే మనిషి రోజురోజుకూ బలహీనపడుతాడని, ఇలాంటి సందర్భంలో ప్రజలకు తామున్నామన్న భరోసాను కూటమి ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు.

తమ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆపన్నుల పాలిట బాసటగా నిలిచి అడిగిన వెంటనే ఆర్థికసాయం అందించడం గొప్ప విషయం అన్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అందించిన డబ్బును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్థికంగా ఇబ్బందులుండి వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్నవారికి ప్రభుత్వం అనునిత్యం తోడుంటు ందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమం ప్రతి నెలా నిర్వహిస్తున్నామని, పేదల పాలిట, పేదల సేవలో, పేదలకు అండగా కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు.

## ఆసక్తి కలిగించిన బంగారయ్య శర్మ ప్రవచనం



**అనపర్తి, మేజర్ న్యూస్ :** శ్రీ శారదా సంగీత కళా సమితి అనపర్తి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 27వ శ్రీ త్యాగరాజ స్వామి వారి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు పాసర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ ప్రవచనం అద్భుతంగా, ఆసక్తికరముగా సాగింది. సౌజన్య కర్త అమ్మిరెడ్డి ఆయిల్స్ అధినేత సబ్బెళ్ళ అమ్మిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేత సత్తిసుబ్బారెడ్డి బ్రహ్మశ్రీ పసర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ జ్యోతిప్రదీపనం గావించి కార్యక్రమం ప్రారంభించారు. నిన్నటి కార్యక్రమానికి కొనసాగింపుగా ఆర్షవిద్యాతపస్వి బ్రహ్మశ్రీ పసర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ వారి ద్వారా ‹ఆదిశంకరులు – శ్రీ శృంగేరి శారదా పీఠ వైభవం అనే అంశం మీద అత్యద్భుతమైన ఆధ్యాత్మిక ప్రవచనం జరిగినది. ఈ ప్రవచనంలో ఆది శంకరులు మార్గనిర్దేశం చేసినట్టు ప్రస్తుత కాలంలో ధర్మ పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమం అమ్మిరెడ్డి ఆయిల్స్ అధినేత సబ్బెళ్ళ అమ్మిరెడ్డి సౌజన్యంతో నిర్వహించుకోవడం జరిగింది. కార్యక్రమానంతరం సౌజన్య కర్త అమ్మిరెడ్డి ఆయిల్స్ అధినేత శ్రీ సబ్బెళ్ళ అమ్మిరెడ్డి, ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేత సత్తిసుబ్బారెడ్డి బ్రహ్మశ్రీ శ్రీనివాస బంగారయ్యశర్మ వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు తమలంపూడి చినఆదిరెడ్డి సమితి సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## నిర్వాసితుల స్ట్రక్చర్ వ్యాల్యూ ఏపీజీవీబీలో నగదు పడేంతవరకు ఆందోళన చేయక తప్పదు

– టిడిపి మండల అధ్యక్షులు ఎడవల్లి భాస్కర్



**కూనవరం, మేజర్ న్యూస్ :** గత నలభై ఐదు రోజుల క్రితం ఏపీజీవీబీ టేకులు బోరు బ్రాంచ్లో నగదు ఎకౌంట్లో జమ కావలసి ఉండగా బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా నిర్వాసితులు ఇబ్బందులు గురవుతున్నారని టిడిపి మండల అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు టిడిపి నాయకులతో కలిసి గత నాలుగు రోజుల క్రితం ఐటిడే పీవో దృష్టికి తీస్కుళ్లడం జరిగింది. పిఓఆర్ ఎంతో మాట్లాడి త్వరలో పడతాయని చెప్పిన బ్యాంక్ అధికారులు నగదు జమ చేయకపోవడంతో సోమవారం నాడు టేకులు బోరు బ్రాంచ్ వద్ద బ్యాంకు సిబ్బంది నిలదీయడం జరిగింది. బ్యాంక్ అధికారులు ఆర్ ఎం దృష్టికి తీసుకుని వెళ్ళగా ఎడవల్లి భాస్కరరావు ఆర్ఎంకి సమస్యలు పూర్తిగా వివరించి మీరు తక్షణం నగదు జమ చేయకపోతే మేము వేరే బ్యాంకు చూసుకోవాల్సి వస్తుందని బ్యాంకుకు సిబ్బందిని కూడా అదనంగా ఏర్పాటు చేయాలని ఫోన్లో ఆర్ఎం దృష్టికి తీసుకువెళ్లారు. మంగళవారం మరల ఐటిడిఏ పిఓ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లనున్నట్లు భాస్కర్ సూర్యకి టెలిఫోన్ ద్వారా తెలియజేశారు.

## శ్రీకృష్ణ దేవరాయలను అవమానించిన మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని అరెస్టు చేయాలి

– కాపు పొలిటికల్ జె.ఎ.సి. కాకినాడ జిల్లా అధ్యక్షులు తుమ్మలపల్లి వాసు డిమాండ్




**కాకినాడ, మేజర్ న్యూస్ :** శ్రీకృష్ణ దేవరాయల చిత్రపటాన్ని కాళ్ళతో తొక్కి అవమానించిన మాజీ ఎమ్మెల్యే వైసిపి నేత చిర్ల జగ్గిరెడ్డిని తక్షణం అరెస్టు చేయాలని కాపు పొలిటికల్ జె.ఎ.సి. కాకినాడ జిల్లా అధ్యక్షులు తుమ్మలపల్లి వాసు డిమాండ్ చేసారు. కాకినాడ ఆర్.టి.ఒ. ఆఫీసు జంక్షన్ వద్ద గల శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం వద్ద కాపు పొలిటి కల్ జె.ఎ.సి. అధ్యక్షులు తుమ్మలపల్లి వాస్తు సభ్యులు చొడిశెట్టి పుత్రయ్య, మాదేపల్లి రమణ, ఎలిశెట్టి రాజేష్‌లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి వాసు మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయల చిత్రపఠాన్ని కాళ్ళతో తొక్కి అవమానించిన జగ్గిరెడ్డిని తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షంచాలని డిమాండ్ చేసారు. మహనీయులను అవమానించడం హిందూ సంస్కృతిని, చరిత్రను కించపరచడమేనని మండిపడ్డారు. జగ్గిరెడ్డిని అరెస్టు చేయకుంటే కాపు పొలిటికల్ జెఎసి తరపున పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## 100 శాతం ఉత్తీర్ణతకు వందరోజుల ప్రణాళిక



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలలో 100 శాతం పాస్ అవ్వడానికి 100 డేస్ యాక్షన్ ప్లాన్‌ను ఇవ్వడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి పి.పుల్లయ్య అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని హైస్కూల్స్‌ను ఎంఈవో పుల్లయ్య సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు సాయంత్రం తరగతుల్లో రోజుకో సబ్జెక్ట్ మీద స్లిప్ టెస్ట్‌లు పెట్టడం జరుగుతుందన్నారు. ఇలా నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను షైనింగ్ స్టార్, రైసింగ్ స్టార్ గా గుర్తించి వారికి ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఈ ప్రక్రియ జరుగు విధానంను పరిశీలించడానికి విద్యాశాఖతో పాటు ఇతర శాఖల అధికారులను కూడా విజిట్ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో పుల్లయ్య గవర్నమెంట్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు.

ఈ సందర్బంగా జరిగిన పరీక్షను ఆయన పరిశీలించారు. అయితే ఈ పాఠశాలలో 52 మంది విద్యార్థులు ఉండగా షైనింగ్ స్టార్ లో 26 మంది విద్యార్థులు, రైసింగ్ స్టార్‌లో మరో 26 మంది విద్యార్థులు ఉన్నట్టు చెప్పారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదన్నారు.

## జనసేన పార్టీ ప్రత్తిపాడు ఇంచార్జ్ వరుపుల తమ్మయ్య బాబు ఆకస్మిక మృతి..



**ఏలేశ్వరం,మేజర్‌న్యూస్ :** ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ,మాజీ ఎంపీపీ, ఏలేశ్వరం మండలం, లింగంపర్తి గ్రామ వాసి అయిన వరుపుల తమ్మయ్య బాబు సోమవారం ఉదయం 11 గంటలకు కాకినాడ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. మృతుడు వరుపుల తమ్మయ్య బాబు 2004 నుండి 2009 వరకు ఏలేశ్వరం ఎంపీపీగా సేవలందించారు. 2019 సంవత్సరంలో జనసేన పార్టీ ఎమ్మెల్యే పదవికి ప్రత్తిపాడు నియోజకవర్గంలో పోటీ చేశారు. కులాలు, మతాలు, పార్టీలతో సంబంధం లేకుండా ఇచ్చిన మాటపై నిలబడి కార్యకర్తలకు అండగా నిలుస్తారని పేరున నాయకుడు, ఆయన మరణ వార్త విని ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకు న్నాయి. కాగా కార్యకర్తలకు న్యాయం చేసేందుకు దూసుకుపోయే స్వభావం గల వ్యక్తి కావడంతో ఇటీవల ప్రత్తిపాడు ఆసుపత్రి సంఘటనతో పార్టీ నుంచి సస్పెండ్ చేయబడ్డారు. కానీ ఇప్పటివరకు ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన ఇంచార్జ్‌ను నియమించలేదు. కాపు సామాజిక వర్గానికి చెందిన తమ్మయ్య బాబుకు ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుకు చిన్నాన్న కొడుకు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమీప బంధువు, ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా వీరి కుటుంబంలోని వ్యక్తి, అలాగే కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ తుమ్మల రామస్వామి ఈయనకు తోడు అల్లుడు, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ తమ్మయ్య బాబుకు సమీపు బంధువు, పర్వత, ముద్రగడ,తోట కుటుంబాలతో బంధుత్వాలు ఉన్నాయి. కార్యకర్తల సందర్శనార్థం సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ఆయన స్వగ్రామమైన లింగంపర్తి స్వగృహం నందు ఆయన పార్దివ దేహాన్ని ఉంచారు. నియోజకవర్గ నలుమూలల నుంచి అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి బోరును విలపిస్తూ పార్థివ దేహాన్ని సందర్శించారు.

**CHANGE OF NAME**

I, **Palli Kella Raj Kumar**, holder of Indian passport no. **P9484354** having permanent address 3-91, S C Peta Hussain Puram, East Godavari, Andhra Pradesh, 533434, India. Residing in Kuwait at present, hereby declare that henceforth my name will be read as under: **Pallikila Veera Venkata Ramana**.

# అన్ని కాలాలలోనూ పానుగంటి రచనలు అవసరం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** పానుగంటి లక్ష్మి నరసింహారావు సాహితీ సమాలోచన సభ పల్లిపాలెం ఆంధ్రీ కుటీరంలో మధుశ్రీ హాల్లో ఘనంగా జరిగింది. ముఖ్య వక్తలుగా డాక్టర్ పొన్నపల్లి శ్రీరామారావు ( నరసాపురం), డా.వాడ్రేవు వీరలక్ష్మి దేవి (కాకినాడ) పాల్గొని విలువైన ఉపన్యాసములు చేశారు. సభకు అధ్యక్షులుగా మధునా పంతుల సత్యనారాయణ మూర్తి వ్యవహరించగా, ప్రముఖ న్యాయవాది కాకుళవరపు రామచంద్రరావు, అడ్వకేటు పానుగంటి జానకి ఇరువురు అద్భుతంగా సభ ఏర్పాట్లు చేశారు. డాక్టర్ పొన్నపల్లి శ్రీరామారావు మాట్లాడుతూ రచనలను సూక్ష్మంగా పరిశీలిస్తే ట్రాజెడీగాను స్థూలంగా చూస్తే కామెడీ గాను కనిపిస్తాయని చార్లీ చాప్లిన్ అన్న ట్రాజెడీ ఇన్ క్లోజ్ షాట్ కామెడీ ఇన్ లాంగ్ షాట్ అన్న మాటలు గుర్తుకు వస్తాయని అన్నారు. వ్యాసాల్లో జంగాల శాస్త్రిగా తానే అవతరించి ఒక్కోసారి పొగిడి మరోసారి చావగొట్టి చెవులు మూసే ప్రయోగం ఒక్క పానుగంటి వల్లే సాధ్యమవుతుందని తెలిపారు. పానుగంటి లక్ష్మీనరసింహారావు పేరే ఆయనకు ఒక బిరుదుని వారికి వేరే బిరుదులు అక్కర్లేదని అన్నారు. అందర్ని పట్టుకుని వేలాడడం మూర్ఖత్వంగా ఉండడం కంఠాభరణం నాటకంలో మనం చూస్తామని, వికటించిన రూపాలు ఎలా ఉంటాయో అలాంటి పాత్రలను పానుగంటి తన రచనల్లో చూపించారని అన్నారు. పానుగంటి ముని మనవరాలు అడ్వకేట్ పానుగంటి జానకి (రామచంద్రపురం) ప్రసంగిస్తూ వంద సంవత్సరాల నాడు భవిష్యత్తు ఎలా ఉంటుందో ఆయన రచనల్లో చిత్రీకరించారని అన్నారు. ఆయన వ్యాసాల్లో తెలిపిన హెయిర్ స్టైల్స్ ఈనాడు అదే విధంగా వెర్రి తలలు వేసేలా ఉండడం చూస్తే ఆయన నిశిత దృష్టి అర్థం చేసుకోవచ్చని తెలిపారు. న్యాయవాది కాకుళవరపు రామచందరావు (రామచంద్రాపురం) మాట్లాడుతూ పానుగంటి లక్ష్మనరసింహారావు కుటుంబ సభ్యుల వివరాలు, రచించిన నాటకాలు ఏఏ సందర్భాల్లో రచించారు, వారి విద్యార్థులు మొదలగు విషయాలు వివరించారు.కాకినాడ ఇండియన్ బ్యాంక్ విశ్రాంత అధికారి పానుగంటి రామచంద్రరావు మాట్లాడుతూ స్వర్గీయ పానుగంటి లక్ష్మి నరసింహారావు మరణించి ఎనిమిదిన్నర దశాబ్దాలు అవుతున్నప్పటికీ ఆయన రచనలు నేటికీ స్మరించుకోవడమే కాక వాటిపై పుస్తకాలు కూడా రావడం అభినందనీయమన్నారు. అనంతరం కాకినాడ ఇండియన్ బ్యాంక్ విశ్రాంత అధికారి పానుగంటి రామచంద్ర రావును ఘనంగా సత్కరించి జ్ఞాపకం అందజేశారు. ఈ వేదికపై వక్తలతోపాటు పలువురిని సన్మానించారు. అనంతరం సీతానగరం నుంచి వచ్చిన నరేంద్ర అనే యువకుడు పానుగంటి లక్ష్మనరసింహారావు సంక్షిప్త జీవిత చరిత్ర అనే పుస్తకాన్ని ఆవిష్కరించి పుస్తకాల వితరణ చేశారు. కాకుళవర రామచంద్రరావు వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో కాకినాడ ఐడియల్ కాలేజ్ విశ్రాంత అధ్యాపకురాలు పానుగంటి పద్మావతితో పాటు పలువురు పాల్గొన్నారు.

# చేతిపంపు బోరు ఏర్పాటు చేసిన సాపిడ్ సంస్థ




**చింతూరు, మేజర్‌న్యూస్ :** పోలవరం జిల్లా చింతూరు మండలంలోని రామన్నపాలెం గ్రామంలో ముత్యాలమ్మ తల్లి గ్రామ దేవతల సన్నిధిలో గత కొన్ని సంవత్సరాలుగా చేతి పంపు లేక నీటి కోసం గ్రామస్థులు చాలా ఇబ్బంది పడుతూ ఉండేవారు. ఈ విషయాన్ని మాజీ ఎంపీటీసీ పండా నాగరాజు, పంచాయతీ సర్పంచ్ మడకం వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సాపిడ్ సంస్థ ప్రతినిధులు అహ్మద్ అలీ దృష్టికి తీసుకెళ్లారు. అహ్మద్ అలీ వెంటనే స్పందించి సాపిడ్ సంస్థ సాయంతో చేతి పంపును ఏర్పాటు చేయించారు.

ఈ కార్యక్రమానికి గ్రామ పూజారి దుమ్మిరి అప్పారావు చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి పూజలు చేసి రిగ్గును ప్రారంభించారు. గ్రామ దేవతల సన్నిధిలో నీటి కొరత లేకుండా చేసిన సాపిడ్ సంస్థ ప్రతినిధులకు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పండా నాగరాజు, రామన్నపాలెం పంచాయతీ సర్పంచ్ మడకం వెంకటలక్ష్మి, గ్రామ పూజారి దుమ్మిరి అప్పారావు, పూసం నారాయణ, వార్డు సభ్యులు దుమ్మిరి చంద్రరావు, పొద్దయ్య, రెడ్డి, తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# నూతన పెట్రోల్ బంకు ప్రారంభం



**ఎటపాక, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా ఎటపాక మండలం నల్లకుంట గ్రామంలో నూతన పెట్రోల్ బంకు ను ప్రముఖ కాంట్రాక్టర్ యం.డి.అలీమ్ ఖాన్,యం.సుశీల సోమవారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా అలీమ్ ఖాన్ మాట్లాడుతూ నెల్లిపాక నుంచి చింతూరు వరకు పెట్రోల్ బంకులేని సమయంలో వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడేవారు అని, ఈ నూతన పెట్రోల్ బంకు ఏర్పాటు చేయడం వలన వాహనదారుల కష్టాలు తొలగినట్లే అని, ఈ నూతన పెట్రోల్ బంకును ప్రతి ఒక్కరు వినియోగించు కోవాలి అని, బంకు యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రావు, మణి కుమార్, మల్లికార్జున రావు, జగదీష్, భాస్కర్ రెడ్డి, నల్లకుంట ఆశ్రమ పాఠశాల సిబ్బంది ఎ పాల్గొన్నారు.

## ఆత్రేయపురం మండల వార్షిక బడ్జెట్ ఆమోదం

– వాడి వేడిగా మండల సమావేశం




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం అధ్యక్షులు కుందా అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించారు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరణ బడ్జెట్ మరియు 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్ సమావేశంలో నిర్వహించగా సభ్యులు ఆమోదించారు. ఈ సమావేశంలో మండల అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, గ్రామీణ అభివృద్ధి తదితర శాఖలకు సంబంధించిన బడ్జెట్ అంశాలను ఎంపిడిఓ బి.ఎస్.ఎస్. వెంకట రామన్ సమావేశంలో ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో పొందుపరిచిన ముఖ్యమైన అంశాలు, వ్యయ ప్రాధాన్యతలు మరియు భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. అలాగే ఆయా శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలు, నిధుల కేటాయింపులు, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సభ్యులతో చర్చించడం జరిగింది.

సభ్యులు తమ సూచనలు, అభిప్రాయాలను వ్యక్తం చేయగా, వాటిని పరిగణనలోకి తీసుకొని బడ్జెట్‌ను అమలు చేయనున్నట్లు సమావేశంలో తెలిపారు. సమావేశంలో పలువురు ఎంపిటిసిలు సర్పంచులు పలు సమస్యలను ప్రస్తావించారు ఏడాదిన్నర కాలంగా ఎంపీటీసీలకు గౌరవ వేతనం చెల్లించకపోవడం పట్ల ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మెర్లపాలెంలో ట్రాన్స్ఫార్మర్లకు ఏర్పాటుకు ప్లాట్ ఫారంలో నిర్మించి ఏడాదికి కావస్తున్న ఇప్పటివరకు ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయలేదని దీంతో గ్రామంలో లో వోల్టేజ్ సమస్య ఏర్పడుతుందని సర్పంచ్ మెర్ల రాము ట్రాన్స్కో అధికారులను నిలదీశారు. అలాగే గ్రామ పంచాయతీలకు రావాల్సిన స్టాంప్ డ్యూటీని తక్షణమే సర్దుబాటు చేయాలని నార్కెడిమిల్లి సర్పంచ్ పాల నాగేశ్వరరావు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో జెడ్పిటిసి సభ్యులు బోణం సాయిబాబా, తహశీల్దార్ ఆర్.డి రామచంద్రమూర్తి, ఎంపిపిటిసి సభ్యులు, సర్పంచులు, మరియు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# తండ్రి బర్త్ డే... తనయుడు బృందం రక్తదానం





**కాకినాడ, మేజర్ న్యూస్ :** రోటరీ గోల్డెన్ జూబ్లీ సీనియర్ సభ్యులు బెస్ట్ ట్రెజరర్ అవార్డు గ్రహీత సత్తి రవి రెడ్డి జన్మదినోత్సవ సందర్భంగా తనయుడు సత్తి వెంకటరెడ్డి మిత్ర బృందం రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. స్థానిక సిద్ధార్థనగర్‌లో రోటరీ బ్లడ్ బ్యాంక్ సంచార రక్త నిధి సేకరణ ప్రత్యేక వాహనంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కామరాజు ప్రారంభించారు. అనంతరం వెంకటరెడ్డి తోపాటు మిత్ర బృందం అందరూ కలిసి స్వచ్ఛంద రక్తదానం చేశారు. సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ తాను దుబాయిలో ఒక ప్రముఖ బ్యాంకులో బాధ్యతలు నిర్వహిస్తున్నానని అయితే తనకు జన్మ నిచ్చి తన అభివృద్ధికి మూల కారణమైన తండ్రి రవి రెడ్డి జన్మదినోత్సవ సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్న ఉద్దేశంతో తన మిత్రులందరికీ సహకారంతో పలు కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. రక్తదానం చేయడం ద్వారా సమాజంలో పలువురికి ప్రాణదానం చేసిన అవకాశం లభిస్తుందన్న తండ్రి సూచనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు సేవతో పాటు పలు ఆలయాల దర్శన కూడా చేసుకోవడం జరిగిందని వెంకటరెడ్డి చెప్పారు.

డాక్టర్ కామరాజు మాట్లాడుతూ రక్త దానం చేయడం ద్వారా ఎంతో మందిని ప్రాణా పాయ స్థితి నుండి రక్షించిన వారవుతామని చెప్పారు. రోటరీ బ్లడ్ బ్యాంకు లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు బ్లడ్ బ్యాంక్ టీం అందిస్తున్న సహకారాన్ని ప్రస్తావిస్తూ స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహణకు అత్యాధునిక సాంకేతిక తో కూడిన సంచార వాహనం బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉండటం అదృష్టంగా భావిస్తున్నామని దీని ద్వారా సకాలంలో బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహణకు ఎంతో సదుపాయంగా ఉందన్నారు. రోటరీ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో కాకినాడతో పాటు పరిసర గ్రామాలలో శిబిరాలు నిర్వహించడమే కాక కోస్తా ఆంధ్రాలో రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తాన్ని అందించి రోగుల ప్రాణాలు కాపాడుతున్నారని ఇది గొప్ప సేవగా డాక్టర్ కామరాజు ప్రస్తావించారు.కార్యక్రమంలో వెంకట్ రెడ్డి న్యాయవాదుల మిత్ర బృందంతో పాటు పలువురు నగర ప్రముఖులు పాల్గొని సత్తి రవి రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. స్వచ్ఛంద రక్తదానం చేసిన దాతలు అందరికీ బ్లడ్ డొనేషన్ ప్రశంసా పత్రంతోపాటు ప్రత్యేక గిఫ్ట్‌లను సత్తి రవి రెడ్డి డాక్టర్ కామరాజు చేతుల మీదుగా అందజేశారు.

# దేవుడిపై రాజకీయం.. వైసీపీకి వినాశకాలం!





- శివలింగ పునఃప్రతిష్టపై విషప్రచారం చేస్తే శివయ్యే శిక్షిస్తాడు
- మంత్రి సుభాష్‌ను విమర్శించే స్థాయి మీకుందా?
- వైసీపీ నాయకులపై నిప్పులు చెరిగిన కూటమి నేతలు

**రామచంద్రపురం/కాకినాడ,మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనను చూసి ఓర్వలేక,వైసీపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని కూటమి పార్టీల నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ద్రాక్షారామ శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ ఘటనలో నిందితుడిని గంటల వ్యవధిలోనే పట్టుకున్నా.. పనిగట్టుకుని మంత్రి వాసంశెట్టి సుభాష్‌పై విమర్శలు చేయడం వారి నీచ రాజకీయాలకు పరాకాష్ట అని మండిపడ్డారు. సోమవారం మీడియా సమావేశంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు వైసీపీ నాయకుల తీరును కడిగిపారేశారు.

**అప్పుడేం చేశారు..ఇప్పుడెందుకు ఈ డ్రామాలు?**

వైసీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా వందలాది ఆలయాలపై దాడులు జరిగితే నోరు మెదపని నాయకులు, నేడు పవిత్రమైన ఆలయాల్లో రాజకీయాలు చేయడం సిగ్గుచేటని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. "మంత్రి సుభాష్ వెంటనే స్పందించి 8 గంటల్లో నిందితుడిని అరెస్ట్ చేయించారు. ఆగమ శాస్త్ర పండితులు, సెంట్రల్ ఆర్కియాలజీ నిపుణుల సమక్షంలో శివలింగ పునఃప్రతిష్ట జరిగింది. ఇంత పారదర్శకంగా పనులు జరుగుతుంటే, వైసీపీ నేత పిల్లి సూర్యప్రకాష్ అవాకులు చవాకులు పేలడం ఆయన అజ్ఞానానికి నిదర్శనం" అని ఎద్దేవా చేశారు.

**అభివృద్ధిపై చర్చకు దమ్ముందా?**

మంత్రి సుభాష్ రాజీనామా డిమాండ్ చేసే నైతిక హక్కు వైసీపీకి లేదని నేతలు స్పష్టం చేశారు. "నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? వైసీపీ నాయకులు తమ వెంట వస్తే వారు కళ్లు మూసుకున్న అభివృద్ధిని చూపిస్తాం" అని సవాల్ విసిరారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాణవాయువులా పనిచేస్తుందని, భక్తుల మనోభావాలతో ఆడుకుంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

"శివుని ఆజ్ఞ లేనిదే చీమ కూడా కుట్టదు.. కానీ మీరు చేస్తున్న ఈ పాపాలకు ఆ కపాలేశ్వరుడి ఆగ్రహానికి గురికాక తప్పదు. ఇకనైనా పద్ధతి మార్చుకోకపోతే ప్రజలే మిమ్మల్ని రాజకీయంగా సమాధి చేస్తారు" అని కూటమి నాయకులు హెచ్చరించారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఇన్చార్జి కర్రి చిట్టిబాబు, చెరుకుపల్లి గణేష్ శర్మ, కంచుమర్తి బాబురావు, టేకుమూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి టీచర్ అసోసియేషన్ మండల మహాసభలో నూతన కమిటీ ఎన్నిక



- ఏటీఏ అధ్యక్షులుగా కాకా రాజు

**ఎటపాక, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా ఎటపాక మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయం జరిగిన మండల మహాసభలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.ఈ సభకు ముందు కనితి శేఖర్ రాష్ట్ర సహాయ అధ్యక్షులు మరియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి జయబాబు నాయకుల సమక్షంలో జండా ఆవిష్కరించి, సభను ప్రారంభించారు.ఈసభలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ అధ్యక్షులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివాసీలకు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ నియామక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్టీ రిజర్వేషన్లలో అద్వకాశి విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ సభలో జిల్లా నాయకుల సమక్షంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కాక రాజు, అపక నాగేశ్వరావు లను మరియు ఇతర శాఖలను ఏకగ్రీవంగా ఎన్నుకొని ఆమోదించారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ-2 సరియం రాజులు, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి రామలక్ష్మి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కనితి రామకృష్ణ, పూరి కిరణ్, జిల్లా నాయకులు కట్టం వీరయ్య, ప్రవీణ్, ప్రసాద్, నాగేశ్వరరావు, శ్రీశైలం మండలంలో ఆట సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎకోశాక్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం




**కాకినాడ, మేజర్ న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో ఆదివారం ఇంజనీరింగ్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ కాకినాడ (ఎకోశాక్) పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. అలుమ్ని ఆడిటోరియం నందు నిర్వహించిన ఈ కార్యక్రమానికి జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కే. ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అతిథులుగా పూర్వ విద్యార్థులు ప్రొ. పి.ఉదయ్ భాస్కర్, అవాంటెల్ లిమిటెడ్ సంస్థ స్థాపకుడు & సీఎండీ డా. ఏ.విద్యాసాగర్, వై.యస్.సుబ్రహ్మణ్యం మరియు కోన సుభాష్ విచ్చేశారు. యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ. ఎన్.మోహన్‌రావు మరియు ఎకోశాక్ సెక్రటరీ డా. బి. నరేష్ స్వాగతం పలికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఉపకులపతి ప్రొ. సి.ఎస్.ఆర్.కే. ప్రసాద్ ఎకోశాక్ నూతన వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ విశ్వవిద్యాలయానికి బలమైన పునాదిగా నిలుస్తోందని అన్నారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవం, నైపుణ్యం మరియు మార్గదర్శకతను ప్రస్తుత విద్యార్థులతో పంచుకోవడం ద్వారా విశ్వవిద్యాలయ అభివృద్ధికి కీలక పాత్ర పోషించగలరని పేర్కొన్నారు. నూతనంగా ప్రారంభించిన ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ వెబ్‌సైట్ ద్వారా పూర్వ విద్యార్థులు పరస్పర సంబంధాలను మరింత బలోపేతం చేసుకొని, విద్యార్థుల శిక్షణ, ఉపాధి అవకాశాలు, పరిశోధన కార్యక్రమాలకు సహకరించేందుకు అవకాశం లభిస్తుందని తెలిపారు. విశ్వవిద్యాలయం-అలుమ్ని అనుసంధానం మరింత పటిష్టమయ్యేలా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలని ఉపకులపతి గారు ఆకాంక్షించారు.డైరెక్టర్ డా.ఏ కృష్ణమోహన్ మరియు ఎకోశాక్ సెక్రటరీ డా.బి నరేష్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల అనుభవాలు, పరిజ్ఞానం, విలువలతో కూడిన జీవితం గురించి ప్రస్తుత విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా పూర్వ విద్యార్థులకు నిర్వహించిన ఆటలు, క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి అతిథులు బహుమతులను అందజేశారు. అనంతరం ఎకోశాక్-2026 నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎకోశాక్ విశాఖపట్నం ఛాప్టర్, హైదరాబాద్ ఛాప్టర్ ప్రతినిధులు, టీచింగ్ & నాన్ టీచింగ్ సిబ్బంది, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదాయ విభజన లేకుండానే పంచాయతీ ఏర్పాటు తగదు

- కలెక్టర్ గ్రీవెన్సులో ఫిర్యాదు చేసిన కొత్తూరు ప్రజలు



**శంఖవరం, మేజర్ న్యూస్ :** రెవిన్యూ ఆదాయ విభజన లేకుండా పంచాయతీని విడదీసి కొత్త పంచాయతీని ఏర్పాటు చేయడం తగదంటూ కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కొంతంగి కొత్తూరు పంచాయతీ శివారు కొత్తూరు ప్రజలు జిల్లా కలెక్టర్ గ్రీవెన్సులో సోమవారం ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిల్లాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా పంచాయతీల విభజన, నూతన పంచాయతీల ఏర్పాటుకు తాజాగా ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నేపథ్యంలో శంఖవరం మండలం కొంతంగి కొత్తూరు పంచాయతీలో అంతర్భాగంగా ఉన్న శివారు గ్రామం కొత్తూరును కూడా విడదీసి నూతన పంచాయతీ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ విషయమై లోగడ ఏర్పాటు చేసిన గ్రామ సభలో కొత్తూరు పంచాయతీ ఏర్పాటుకు రెండు గ్రామాల ప్రజలూ మాట మాత్రంగా అంగీకరించారు. కానీ రెవిన్యూ (ఆదాయం) విభజనపై స్పష్టమైన వివరణ లేకపోవడంతో గ్రామ సభ తీర్మానం చేయలేదు. ఐతే తాజాగా గ్రామ సభ తీర్మానం చేసినట్టు దస్త్రాలను తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంచాయతీ సమర్పిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఇంఛార్జి కలెక్టరైన జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌కు కొత్తూరు వాసి, నియోజకవర్గం జనసేన పార్టీ నాయకుడు, విజయవాడ రైల్వే డివిజన్ సంప్రదింపుల కమిటీ సభ్యుడు గొర్లి నాగేశ్వరరావు నేతృత్వంలో కొత్తూరు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామ సభను నిర్వహించలేదని, కొత్తూరు పంచాయతీకి ఏవిధమైన రెవిన్యూ భూములు లేకుండా పంచాయతీగా విడదీయడం వలన కొత్తూరు పంచాయతీకి ఏవిధమైన ఆదాయం లేకపోతే పంచాయతీ పరిపాలన సక్రమంగా ఉండదు. అందువల్ల పంచాయతీతోపాటు రెవిన్యూను కూడా విడదీయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాయపాటి చంటి, గుండు గోవిందు, ఆకేటి శ్రీను, రాయి రామకృష్ణ, తోకల ఏసు బాబు, దేవి వెంకణ, పర్సిన శివ, తురాయి పాపారావు, కర్రి అగ్గిబాబు, సాయి, కొప్పుల వీరబాబు, గొల్లవిల్లి సూకరాజు, తేటకాయల అప్పారావు, కర్రీ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పోటీలను విజయవంతం చేయాలి



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పడవ, ఈత సాంస్కృతిక కార్యక్రమాలను తదితర పోటీల కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు యువనాయకులు బందారు సం జీవ్, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణం రాజు అన్నారు. సోమవారం మండల తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్, కమిటీ సభ్యులు తోట రజిని, ముదునూరి గణపతి రాజు, మజ్జి తరుణ్, భావన శ్రీనులు ఆత్రేయపురం లాకుల వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు ముందుగా నిర్వహించ నున్న ట్రోఫీ పోటీల సమయం దగ్గర పడుతుండటంతో పనులు పూర్తి చేయాలని సూచించారు. పోటీలలో పాల్గొనే వారికి వసతుల ఏర్పాటు, అలాగే సందర్శనకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ఈ గోదావరి ట్రోఫీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు.

# ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పడకుండా కూటమి ప్రభుత్వం చర్యలు



కాకినాడ, మేజర్ న్యూస్ : విద్యుత్ చార్జీల భారం ప్రజలపై పడకుండా విద్యుత్ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర పెరిక వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి బద్రి తెలిపారు. కాకినాడలోగల పెరిక వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి బద్రి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా బద్రి మాట్లాడుతూ జగన్మోహన్రెడ్డి ప్రమాణ స్వీకారం రోజున విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి అదికారంలోకి వచ్చిన తరువాత ఏకంగా 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ చార్జీల భారం ప్రజలపై పడకుండా కూటమి ప్రభుత్వం భరించి అసొమ్మును విద్యుత్ సంస్థలకు చెల్లించిందని అన్నారు. జగన్ అక్వారైతులకు యూనిట్ 3.50 పైసలకు ఇస్తే కూటమి ప్రభుత్వం దానిని 1.50 పైసలకు తగ్గించిందన్నారు. వైసిపి నాయ కులు కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షమ పాలనను చూసి ఓర్వలేక అసత్య ప్రచారలచేడం దారుణం అన్నారు. ప్రజలు వైసిపి నాయకుల మాటలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు.విద్యుత్ చార్జీల భారం ప్రజలపై పడకుండా విద్యుత్ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే విదంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర పెరిక వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి బద్రి తెలిపారు. కాకినాడలోగల పెరిక వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి బద్రి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వ హించారు.

ఈ సందర్భంగా బద్రి మాట్లాడుతూ జగన్మోహన్రెడ్డి ప్రమాణ స్వీకారం రోజున విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత ఏకంగా 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ చార్జీల భారం ప్రజలపై పడకుండా కూటమి ప్రభుత్వం భరించి అసొమ్మును విద్యుత్ సంస్థలకు చెల్లించిందని అన్నారు. జగన్ అక్వారైతులకు యూనిట్ 3.50 పైసలకు ఇస్తే కూటమి ప్రభుత్వం దానిని 1.50 పైసలకు తగ్గించిందన్నారు. వైసిపి నాయ కులు కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షమ పాలనను చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలు చేయడం దారుణం అన్నారు. ప్రజలు వైసిపి నాయకుల మాటలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు.ప్రజలపై విద్యుత్ భారం పడుకుండా రిఎనర్జీ పై దృష్టి పెట్టిందని ప్రతీ ఇంటికి సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోడానికి సబ్సిడీ ఇస్తుందని ఎ,స్,ర్ లకు సోలార్ పెనల్స్ ను ఉచితంగా అందిస్తుధని దీషలకు ఆధానంగా 20వేలు రూపాయలు సబ్సిడీ తెలుగుదేశం ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు.

# ఓటరు నమోదుకు సహకరించండి

**– టిడిపి నేత వెంకటలక్ష్మి**



**అడ్డతీగల,మేజర్న్యూస్ :** ఏజెన్సీ అడ్డతీగల మండలంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో కొత్త ఓటు నమోదు కార్యక్రమం తో పాటు గత ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను సవరించే కార్యక్రమం కూడా వేగవంతంగా జరుగుతుందని ఈ అవకాశాన్ని మండల వాసులంతా సద్వినియోగం చేసుకొని ఓటునమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు వీరా వెంకటలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని 18 సంవత్సరాల నుండి ప్రతి ఒక్కరు కొత్త ఓటును నమోదు చేయించుకుని భారత రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన ఓటు హక్కును పొందాలని ఆమె పేర్కొన్నారు. అడ్డతీగల పంచాయతీకి సంబంధించి బూత్ లెవెల్ ఆఫీసర్గా వీఆర్వో రాజేశ్వరి రీ వెరిఫికేషన్ తో పాటు కొత్త ఓటు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందే విధంగా సన్నద్ధం కావాలని తెలుగుదేశం పార్టీ యువతకు సూచించారు.

# ఇప్పటికైనా వినియోగించండి



**అడ్డతీగల, మేజర్న్యూస్ :** ఏజెన్సీ మండల కేంద్రమైన అడ్డతీగలలో గడిచిన ఎనిమిది సంవత్సరాలుగా సకల సౌకర్యాలు వసతులు ఉండి నిరుపయోగంగా అలంకారప్రాయంగా ఉన్న ఒకప్పటి వసతిగృహం పూర్తిగా శిథిల స్థితికి చేరుకోకముందే మండల స్థాయి అధికారులు ఇప్పటికైనా గుర్తెరిగి వినియోగంలోకి తీసుకురావాలని తద్వారా ప్రభుత్వ సంపదను కాపాడాలని పలువురు కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే బీసీ విద్యార్థుల సంక్షమం కోసం లక్షలాది రూపాయల వ్యయంతో సకల వసతులతో సుమారు 250 మందికి వసతి కల్పించేలా ఈ హాస్టల్ భవనాన్ని నిర్మించారు. 2017 వ సంవత్సరంలో ఈ ప్రాంతంలో బీసీ విద్యార్థులు తక్కువగా ఉన్నారని అందువల్ల నిర్వహణ భారం ఎక్కువ అవుతుందన్న కారణంతో ఇక్కడ చదువుతున్న విద్యార్థులను విలీనం పేరుతో కాకినాడ బీసీ వసతి గృహాలకు తరలించారు. అప్పటినుండి గడిచిన ఎనిమిది సంవత్స రాలుగా అన్ని ఉండి కూడా ఎందుకు పనికిరాని పాడు బడిన గృహాన్ని వదిలేసినట్లు ఇక్కడి అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీనివల్ల ఇప్పటికే కొన్ని విలువైన వస్తువులు దొంగలబారిన పడగా కొన్ని సందర్భాల్లో కొన్ని అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా ఈ భవనం మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్క నియోజకవర్గంతో ఏర్పడిన నూతన పోలవరం జిల్లాగా ఈ ప్రాంతం గుర్తించడంతో ప్రజలకు పరిపాలనా సౌలభ్యం కోసం ఇటువంటి ప్రభుత్వ భవనాలను అలాగే మండల కేంద్రాలలో నిరుపయోగంగా పడి ఉన్న ప్రభుత్వ స్థలాలను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను కోరుతున్నారు.

## కంటి వైద్య శిబిరంలో 100 మందికి పరీక్షలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట పట్టణ పరిధి బ్రౌన్ పేట అంబేద్కర్ పార్కులో సోమవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 4 వ వార్డ్ కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, జనసేన నాయకులు పిట్టా జానకి రామారావులు ప్రారంభించారు. ఈ శిబిరం నందు కాకినాడ డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ సుభద్రదేవి లు సుమారు 92 మందికి కంటి పరీక్షలు, బీపీ షుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించి, 9 మందిని కంటి శస్త్ర చికిత్సకు ఎంపిక చేసి,63 మందికి కళ్ళజోళ్ళు,మందులను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాలికి కుసుమ చంటిబాబు, నూతలపాటి అప్పలకొండ, అగర్వాల్ హాస్పిటల్ వైద్యులు, టెక్నిషియన్ రాహుల్, కోఆర్డినేటర్ ఎస్.చంద్ర కిషోర్,సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రీన్ గార్డెన్ క్రికెట్ టోర్నమెంట్ విజేత కాకిలేరు టీం



**పెరవలి, మేజర్ న్యూస్ :** తీపర్రు గ్రామంలో గత 15 రోజులుగా భారీ ఎత్తున నిర్వహించిన గ్రీన్ గార్డెన్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలుగా కాకిలేరు టీం నిలిచింది. టోర్నమెంట్ విజేతలైన కాకలేరు టీంకి కుందుల వెంకట భూపతిరావు 50వేల రూపాయలు మరియు సీల్డ్ బహుమతి అందించారు. 2 వ స్థానంలో నిలిచిన తణుకు సూరి 11టీం కి కోడూరి నారాయణరావు మరియు మొగల్లపు చిన్న లక్ష్మనారాయణ 25వేల రూపాయలు మరియు సీల్డ్ అందించారు. 3వ బహుమతిగా 10 వేల రూపాయలు పిట్టల వేమవరం టీంకి ఇంపల్స్ ప్రిన్సిపల్ రాంప్రసాద్, ఎర్రింకి పెద్దిరాజు అందించారు. మ్యాన్ ఆఫ్ ద సిరీస్ సెమీస్కి సీల్డ్ ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, సింహాద్రి సత్యనారాయణ అందించారు. ఈ కార్యక్రమానికి కంటిపూడి రామకృష్ణ, నందమూరి నారాయణ రావు, సింహాద్రి గంగరాజు,ర్యాలీ వెంకటేశ్వరరావు, కరాటం శ్రీనివాస్, దాయిన హరిబాబు తదితరులు ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రీన్ గార్డెన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించిన యువకులను గ్రామ పెద్దలందరూ అభినందించారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు



**పెద్దాపురం,మేజర్న్యూస్ :** సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి 8 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు తెలిపారు.ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఏఓ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్.డబ్లూఓ. వాణి, ఎడిఎ దైవకుమార్, ప్రధానోపాధ్యాయులు డి.జె.రవీంద్ర, డిఎల్పిఓ కార్యాలయ ఏఓ మైథిలి, హౌసింగ్ ఏఇ రవిశంకర్, ఐసిడిఎస్ సిబ్బంది రమణమ్మ, హెచ్డబ్లూఓ శ్రీవల్లి, డివిజన్లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**– గ్రీవెన్స్‌లో ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పోలవరం జిల్లా రంపచోడవరం ఇన్చార్జి కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటిడిఏ సమావేశపు హాలులో వివిధ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీపూజ తిరుమణి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్, ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులు పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రంపచోడవరం మండలం పందిరి మామిడి జంక్షన్ నుండి వై.రామవరం మండలం చవిటి దిబ్బలు గ్రామల మధ్యలో 32 కిలోమీటర్లు రోడ్డు మంజూరు కాగా మధ్యలో సుమారు పది కిలోమీటర్లు ఫారెస్ట్ క్లియరెన్స్ లేక మధ్యలో రోడ్డు పనులు ఆపివేయడం జరిగిందని ఈ మధ్యలో రోడ్డు ఆగిపోవడం వలన రెండు మండలాలకు సంబంధించిన గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే మధ్యలో ఆగిపోయిన రోడ్డు పనులకు ఫారెస్ట్ క్లియరెన్స్ మంజూరు చేసి రోడ్డు పూర్తిచేయాలని ఎంపీటీసీ బచ్చల మంగాదేవి, బచ్చల సుబ్బారెడ్డి దరఖాస్తు సమర్పించారు. వై. రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని పాలగడ్డ నుండి బొడ్డగుంట గ్రామాల మధ్య 9 కిలోమీటర్లకు సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని అదేవిధంగా మంగంపాడు గ్రామంలోని డ్రైనేజీ, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని సారంకోట అబ్బాయి రెడ్డి దరఖాస్తు సమర్పించారు. గంగవరం మండలం మోహనాపురం పంచాయతీలోని లక్ష్మపురం గ్రామంలోని 26 కుటుంబాలకు మొదటి వీధికి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని కంగల సూరిబాబు, కంగల అబ్బాయి దొర దరఖాస్తు సమర్పించారు. దేవీపట్నం మండలం పెద్ద నూతులు గ్రామంలో గిరిజనుల పశువుల కోసం గోకులం షెడ్లు ఏర్పాటు చేయాలని కామారపు పండమ్మ దరఖాస్తు సమర్పించారు. రాజవొమ్మంగి మండలం ముర్లవాణి పాలెం గ్రామంలో 22 కుటుంబాలకు 60 ఎకరాలు వ్యవసాయం చేసుకొనుటకు చెక్ డాం ఏర్పాటు చేయాలని సిహెచ్.సోమరాజు, టి. పెంటారావు, సిహెచ్. రాంబాబు దరఖాస్తు సమర్పించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పి.అంబేద్కర్, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ మురళీ, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నందు, శిశు సంక్షమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పడాల ఝాన్సీరామ్, ఎక్సైజ్ అండ్ ప్రొఫెషన్ శాఖ అడిషనల్ సూపర్డెంట్ లావణ్య, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపర్డెంట్ సుబ్రహ్మణ్యం, జిల్లా ఆడిట్ అధికారి సురేష్ బాబు, జిల్లా సివిల్ సప్లై అధికారి మోహన్ బాబు, డిటిఓ ఎన్ సత్యనారాయణ, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, డివిఎల్‌డివో కోటేశ్వరరావు, ఎడియం & హెచ్ఓ డాక్టర్ పి. సరిత, ఎడీఏ రామ్మోహన్, పిహెచ్ఓ దేవదానం, జిసిసి డిఎం జయశ్రీ, పిఏఓ. ఎల్.రాంబాబు, తహసిల్దార్ పి.బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, సిడిపివోలు క్రాంతి కుమారి, లక్ష్మి, ఉమా, శాంతి కుమారి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, సుబ్బయ్య, ఏపీవోలు డి.ఎన్.వి.రమణ, రామ తులసి, ఎక్స్చేంజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు శ్రీధర్, ఇంద్రజిత్తు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పంచాయతీరాజ్ ఎన్.సీతయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.వెంకటరమణ,శివ మల్లికార్జునరావు, సుబ్బారావు, భవాని, డాక్టర్ శ్వేత , వెలుగు ఏపిడి దేగలయ్య, డిప్యూటీ తహసిల్దార్లు రవీంద్రబాబు, జిలాని, శ్రీధర్, సబ్ రిజిస్ట్రర్ ఉపేంద్ర, ఉపాధి హామీ పథకం ఏపీడి శ్రీనివాస్ విశ్వనాథ్, పీఎంయు అధికారి చంద్రకళ పాల్గొన్నారు.

# సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలి



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** 11,12,13 తేదీలలో జరగనున్న సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో బీ.కే.ఎస్.ఎస్.వెంకట్రామన్, ఇన్చార్జి తాసిల్దార్ రామచంద్ర మూర్తి, ఎంఈఓ వరప్రసాదరావులు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో 11,12,13 తేదీలలో జరగబోవు పడవల పోటీలు, ఈతల పోటీలు, ముగ్గుల పోటీలు, గాలి పటాల పోటీలు, కయాకింగ్ మరియు కైనా పోటీల నిర్వహణ నిమిత్తం అందరు ఉపాధ్యాయ ఉపాధ్యానియులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో పడవల పోటీలు, ఈతల పోటీలు, ముగ్గుల పోటీలు, గాలి పటాల పోటీలు, కయాకింగ్ మరియు కైనా పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నియమించడమైనదని తెలియజేసారు. ఈ కార్యక్రమములో కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

# 125 రోజులు ఉపాధి పనులు కల్పించాలి



**– పోలవరం ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** జిల్లాలో వికసిత్ భారత్ – రోజ్ గార్, ఆజీవికా మిషన్ (గ్రామీణ), (విబి జి రామ్) ద్వారా జాబ్ కార్డులున్న ప్రతీ కుటుంబానికి 125 రోజులు ఉపాధి పనులు కల్పించాలని పోలవరం జిల్లా (రంపచోడవరం) ఇంచార్జ్ కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో సోమవారం వికసిత్ భారత్ – (గ్రామీణ) రోజ్ గార్, ఆజీవికా మిషన్ (గ్రామీణ) (విబి జి రాం జి ) నూతన చట్టం–2025. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చట్టం ద్వారా ప్రతీ కుటుంబంలో 125 రోజులు ఉపాధి పనులు కల్పించే విధంగా అవగాహన పోస్టర్లు జిల్లా కలెక్టర్ ఎస్.దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీపూజ తిరుమణి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్, సబ్ కలెక్టర్ సాహిత్, ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత, జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిబంధనలు ప్రకారం జాబ్ కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికి 125 రోజులు ఉపాధి పనులు కల్పించాలన్నారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో 100 రోజుల నుండి 125 రోజులకు పెంచిన ఉపాధి పనులకు సంబంధించిన వివరాలు ప్రతి కుటుంబానికి ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు.

జిల్లాలో గ్రామాలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబందించి ఆయా గ్రామాలలో తీర్మానాలు చేసుకొని నివేదికలు సంబంధిత అధికారులకు సమర్పిస్తే పూర్తిస్థాయిలో పరిశీలించి ఆయా గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడి శ్రీనివాస్ విశ్వనాథ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

**– రోడ్డు భద్రత స్టిక్కర్ల ఆవిష్కరణ**



**చింతూరు, మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా చేపట్టిన ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత మాసోత్సవాలు సందర్భంగా అవగాహన సదస్సు, రోడ్డు భద్రత గూర్చి స్టిక్కర్లు ఆవిష్కరించినట్లు మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ బండారు చల్లారావు తెలిపారు. ఈ సందర్భంగా చల్లారావు మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 37వ జాతీయ రహదారి భద్రత మహోత్సవాలు జరుగుతున్నాయని, అందులో భాగంగా శిక్షణతో భద్రత–సాంకేతికత అనే నినాదంతో కార్యక్రమాలు చేపడుతున్నట్లు, దీనిలో భాగంగానే సోమవారం ఆటో డ్రైవర్లతో చట్టి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చట్టి అడ్డాలోని ఆటో డ్రైవర్‌తో పాటు, సామాన్య ప్రజలు, రవాణా సిబ్బంది పాల్గొన్నారు.

## తుమ్మలపల్లి గ్రామాన్ని సందర్శించిన జిల్లా మలేరియా అధికారి



**అల్లవరం, మేజర్ న్యూస్ :** జిల్లా మలేరియా అధికారి, నక్కా వెంకటేశ్వరరావు, బెండమూర్లంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తుమ్మలపల్లి గ్రామన్ని సందర్శించినారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులను కలిగించే దోమా లార్వా నిర్మూలనలో భాగంగా ఇంటింటికి తిరిగి దోమ లార్వాను పరిశీలించినారు. దోమలను అరికట్టుటను గూర్చి ప్రజలందరికీ అవగాహణ కల్పించినారు. దోమలు పుట్టకూడదు, దోమలు కుట్టకూడదు, నీటిని నిల్వ ఉంచకూడదు అని ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించి ప్రతి ఇంటా నీటి నిల్వలను తీసివేసి పాత్రలు శుభ్రంగా కడుగుకొని ఆరబెట్టుకోవాలని సూచించడం జరిగినది. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, నీటి నిల్వలపై మూతలు ఉండేలా చూసుకోవాలని తెలియజేసినారు. దోమల నిర్మూలనకు బిటిఎ, అబాటే రసాయనాలను పిచికారి చేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎస్‌యూవో ఎన్.వి. రామారావు, హెచ్ఎస్ ఎన్.ఎల్.వి.రంగనాద్, హెల్త్ అసిస్టెంట్, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశాలు పాల్గొనడం జరిగింది.

## 10వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు




**రంపచోడవరం, మేజర్‌న్యూస్:** జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు పరిధిలో ఈనెల 10వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అల్లూరి సీతారామరాజు జిల్లా పంచాయతీ అధికారి పి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. రంపచోడవరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన గ్రామ సభలో డిజిపిఓ చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించి, పరిశుభ్రత పాటించాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్ కవర్లు నిర్మూలనకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలవరం జిల్లా డిజిపిఓ కోటేశ్వరరావు, ఎస్టీ కమీషన్ సభ్యురాలు గొర్లె సునీత, ఎంపిడిఓ ప్రసాద్, రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య, పంచాయతీ కార్యదర్శి కామరాజు తదితరులు పాల్గొన్నారు.